

తొర్రూరు ఎంపీడీవోగా వేణుమాధవ్ బాధ్యతల స్వీకరణ



తొర్రూరు, జూలై 30: తొర్రూరు మండల ప్రజాపరిషత్ ఎంపీడీవోగా బి.వేణుమాధవ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఎంపీవోగా బాధ్యతలు చేపట్టిన పూర్ణచందర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించి తిరిగి ఎంపీవోగా వెళ్లడంతో పెద్దవంగర ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.వేణుమాధవ్ మంగళవారం ఎఫ్ఏసీ ఎంపీడీవోగా కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టారు.

రుణమాఫీ రూ.178.39 కోట్లు

రెండోవిడతలో 16,611 మంది రైతులకు లబ్ధి



రైతులకు చెక్కులను అందజేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వ్యవసాయాధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 30 : జిల్లాలో రెండోవిడత రుణమాఫీ చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ దఫాలో 16,611 మంది కర్షకులకు రూ.178.39 కోట్ల రుణమాఫీ జరిగింది. మంగళవారం ఈ రుణమాఫీ కార్యక్రమాన్ని హైదరాబాద్ శాసన సభ ప్రాంగణంలో వర్చువల్ విధానంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర మంత్రులతో కలిసిమధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వివిధ జిల్లాలను ప్రస్తావిస్తూ మహబూబాబాద్ జిల్లా నుంచి మహబూబ్‌నగర్ వరకు అంటూ మహబూబాబాద్ జిల్లా పేరును ఉచ్చరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వ్యవసాయం దండుగ కాదు.. వ్యవసాయం ఓ పండుగ అని చేస్తున్న ప్రయత్నం ఈ రుణమాఫీ అంటూ చెప్పారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా రెండోవిడత లక్షన్నర రూపాయల రుణమాఫీ కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో రైతులు, వివిధ శాఖల అధికారులతో ఘనంగా నిర్వహించారు. రుణమాఫీకి సంబంధించిన చెక్కులను పలువురి రైతులకు చెక్కులను అందచేశారు.

బ్యాంకు అధికారులతో కలిసి కలెక్టర్ చెక్కుల పంపిణీ..

రెండోవిడత రూ.లక్షన్నర వరకు రుణమాఫీ అయిన పలువురు రైతులకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎ.డేవిడ్, వ్యవసాయ సహకారశాఖ, బ్యాంకు అధికారులతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురం నుంచి మట్టిపెల్లి గట్టయ్య, డోర్నకల్ మన్నెగూడెం నుంచి రుద్ర వెంకన్న, కురవి లింగ్యాతండా నుంచి బాదావత్ లాలు, బయ్యారం సీతంపేట నుంచి మాలోతుబిక్కు, కొత్తగూడ ముస్మి నుంచి భూక్య రమేష్, తొర్రూరు నుంచి అనుమాల విజయ్‌లకు రుణమాఫీ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ రెండోవిడత రుణమాఫీలో 16,611 మంది రైతులకు రూ.178.39 కోట్లు రుణమాఫీ జరిగిందని చెప్పారు. నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అవుతాయని, బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సహకరమందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారులు నర్సింహారావు, అలివేలు, జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏలు లక్ష్మీనారాయణ, శోభన్‌బాబుతో పాటు వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

- పలువురు అన్నదాతలకు చెక్కులు అందజేసిన కలెక్టర్, ఇతర శాఖల అధికారులు
- సీఎం వీడియోకాన్ఫరెన్స్‌ను వీక్షించిన రైతులు
- మానుకోట పేరును ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి

రైతు వేదికల్లో ఇలా..

జిల్లాలోని పలు రైతు వేదికల్లో రెండోవిడత రుణమాఫీని ముఖ్యమంత్రి ప్రారంభించిన కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వార రైతులు వీక్షించారు. తొర్రూరులోని మాటేడు రైతు వేదికలో తహసీల్దార్ వినోద్‌కుమార్, ఏఈవో భరత్‌చంద్ర, మానుకోట రైతు వేదికలో ఏఈవోలు లావణ్య, సాయిప్రకాష్‌తో పాటు రైతులు, బయ్యారం, కొత్తపేట రైతు వేదికల్లో ఏఈవో సురేష్, పూజిత, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌నాయక్, వెంకట్రామయ్య, రాంబాబు, సురేష్‌తో పాటు రైతులు, దంతాలపల్లిలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో విక్రమ్, ఏఈవో సతీష్, ఎంపీవో పాషాతో పాటు రైతులు పాల్గొన్నారు. కేసముద్రంలోని రైతు వేదికలో ఏఈవోలు రాజేందర్, మురళీ, సుమన్, రైతులు, కురవిమండలం గుండ్రాతిమడుగు రైతు వేదికలో కురవి తహసీల్దార్ సునిల్‌రెడ్డి, ఏవో మంజుఖాన్, ఏఈవో రమేష్, నర్సింహులపేటలో ఏఈవోలు రామకృష్ణ, మౌనిక, కరిష్మా, నెల్లికుదురులో ఏఈవోలు ప్రవీన్, సుమన్, పెద్దవంగరలో ఎంపీడీవో వేణుమాధవ్, తహసీల్దార్ మహేందర్, ఏఈవోలు యశస్విని, రైతులు సోమయ్య పాల్గొనగా కొత్తగూడలో తహసీల్దార్ రమాదేవి, ఏఈవోలు రాజు, వినోద్, సుష్మిత పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రదర్శన..

మహబూబాబాద్ టౌన్ : ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుబెట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్‌రామరాజు అన్నారు. రైతులకు రూ.1.50 లక్షల రుణమాఫీ చేసిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ శివారు శనిగపురంలోని పంట పొలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంపూర్ణ రుణమాఫీ అయింది.. ఇగ కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు అండ్ టీంకు బర్నాల్ రాసుకోవడమే మిగిలిందంటూ ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శంతన్‌రామరాజు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు రాములునాయక్, బొమ్మరాజు కుమారస్వామి, రాంశెట్టి ఉప్పలయ్య, బుచ్చయ్య, హస్సేన్, భావ్‌సింగ్, బాసు, రాజు, వీరన్న, పవన్ తదితరులు పాల్గొన్నారు.



శనిగపురంలో ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ తిరుపతిరావు



పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోట్స్ సిబ్బందితో సమీక్షిస్తున్న తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, జూలై30 : బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బంది విధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బందితో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తక్షణమే స్పందన లభించేది డయల్ 100 మాత్రమేనని చెప్పారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో డయల్ 100, 112 ద్వారా వచ్చిన కాల్స్‌కు బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బంది స్పందించాలన్నారు. వీలైనంత త్వరగా ఘటన స్థలానికి చేరుకోవడం ద్వారా నేరం యొక్క తీవ్రతను వీలైనంత వరకు తగ్గించడం జరుగుతుందన్నారు. ఆపదలో ఉన్న బాధితులు పోలీసుల సాయం కోసం డయల్ 100కు ఫోన్ చేస్తారని, దీని ద్వారా పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న, లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ నందు బ్లాక్‌చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సైబర్‌నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు. రూరల్ సీఐ సర్వయ్య బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

కొత్తగూడ : కొత్తగూడ, గంగారం మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ తిరుపతిరావు సూచించారు. కొత్తగూడలో మంగళవారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులు, ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబురావు, కొత్తగూడ. గంగారం ఎస్సైలు కుశకుమార్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి : సీఐ

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సీఐ బాబురావు సూచించారు. గంగారం మండలంలోని మడగూడెంలో ఆర్ఓపీ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. మడగూడ గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. ఎస్సైలు రవి కుమార్, ఎస్సై కుశకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్రం విఫలం

- డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 30 : విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కుపరిశ్రమ ఏర్పాటులో కేంద్రప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి విమర్శించారు. బయ్యారం ఉక్కుపరిశ్రమ ఏర్పాటు ఉద్యమ కేసులో మహబూబాబాద్ కోర్టుకు మంగళవారం కాంగ్రెస్, సీపీఐ నాయకులు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బయ్యారం ఉక్కుపరిశ్రమ ఏర్పాటులో తాత్సార్యం చేస్తోందని చెప్పారు. కేంద్రబడ్జెట్‌లో నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు గుగులోతు దస్రూనాయక్, రేషపల్లి నవీన్, మేక వీరన్న, కేదాసు రమేష్, మాదరబోయిన యాకయ్య పాల్గొన్నారు.

అక్రమ కేసుల ఎత్తివేతపై ప్రకటన చేయాలి : సీపీఎం

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల ఎత్తివేతపై ప్రభుత్వం ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ డిమాండ్‌చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్‌తండా గిరిజన రైతుల కోసం పోరాడిన కేసులో మానుకోట కోర్టుకు సీపీఎం, సీపీఐ నేతలు హాజరయ్యారు. జిల్లాలో జరిగిన అనేక పోరాటాల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టిందని వాటిని ఎత్తివేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలన్నారు. రేషపల్లి నవీన్, శివాజీ,భాస్కర్, బాలు, సురేందర్, వెంకన్న, మంగ్యా, జ్యోతి, అమ్ము, హాసిలి, బుజ్జి, అనూష, పురా పాల్గొన్నారు.



మానుకోట కోర్టుకు హాజరైన కాంగ్రెస్, సీపీఐ నేతలు

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 30 : పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ శివారు జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి, స్కూల్ నిర్వహణకు ఉపయోగించే పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వంటచేసే సమయంలో శుభ్రతను పాటించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10 జీపీఏ సాధించే విధంగా చూడాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు జూచించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సైదులురెడ్డి, శ్యామ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రామారావు

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం..

మహబూబాబాద్ జిల్లాలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం ఆగస్టు 3వ తారీకు వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ టీఆర్‌ఈఐఎస్ యాజమాన్యాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను రెండు జతల ప్రతులను సంబంధిత మండల విద్యాధికారిచే ధ్రువీకరించి నిర్ణీత సమయంలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న యలమంచిలి వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూలై 30 : మానుకోట మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పట్టణకార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూసెంటర్ నుంచి రజాలిపేట వరకు నిర్మిస్తున్న 66 ఫీట్లరోడ్డును వెంటనే పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలన్నారు. పట్టణంలోని గ్రీన్‌ల్యాండ్‌లపై కమిషనర్ శ్వేతప్రతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రదాన కార్యదర్శి మోసంగి మురళీ, పట్టణాధ్యక్షుడు ఆకులశ్రీనివాస్, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, రాధాపటేల్, ఇందు భారతి, సిరికొండ సంపత్, పల్లె సందీప్, ఓర్సు పద్మ, బాలునాయక్, నరేష్, శ్రీకాంత్, యశ్వంత్, బస్వయ్య, రమేష్‌నాయక్, సంపత్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

మహబూబాబాద్ రూరల్, జూలై 30 : జిల్లా కేంద్రంలోని శిఖార్‌ఖానాగడ్డకు చెందిన బీటెక్ విద్యార్థి కొమ్ము సిద్ధుపై మంగళవారం వీధికుక్కలు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. శిఖార్‌ఖానాగడ్డకు చెందిన కొమ్ము కిరణ్-విజయ దంపతుల కుమారుడు సిద్ధు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యనభ్యసిస్తున్నాడు. అదే కాలనీలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కుక్కలు అతని వెంట పడ్డాయి. ఇది గమనించిన సిద్ధు ఒక్కసారిగా పరుగెత్తాడు. దీంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన స్థానికులు తోట శ్రీనివాస్, తోట యాకయ్యలు మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్‌కు కుక్కలను నివారించాలని ఫిర్యాదు చేయడంతో మునిసిపల్ సిబ్బందిని పంపించి దాడికి యత్నించిన కుక్కలను పట్టుకున్నట్లు చెప్పారు.

ఏజెన్సీలో భారీ వర్షం

గంగారం, కొత్తగూడ మండలాల్లో కుండపోత

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, నిలిచిన రాకపోకలు
- మత్తళ్లు దూకుతున్న చెరువులు





కొత్తగూడలో పొంగిప్రవహిస్తున్న భూర్కపల్లివాగు



గాంధీనగర్ శివారులో ప్రవహిస్తున్న గాంధీనగర్ వాగు

కొత్తగూడ, జూలై 30 : ఏజెన్సీ కొత్తగూడ, గంగారం మండలాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంగారం మండలంలో 120.2 మీ.మీ, కొత్తగూడలో 102.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. భారీవర్షం కురవడంతో చెరువులు మత్తళ్లు పోశాయి. పంటపొలాల్లో నీరు నిలిచింది. వాగులు పొంగి ప్రవహించాయి. కొత్తగూడ మండలంలోని కొత్తగూడలో భూర్కపల్లివాగు, గాంధీనగర్ వాగు, గాదెవాగు, మొండ్రాయిగూడెం వాగు, వేలుబెల్లిలో కత్తెర్లవాగు, ముస్మీలో ముస్మీవాగు, గంగారం మండలంలో పందిపంపుల వాగు, కోమట్లగూడెం వాగు, కాటినాగారం వాగులు పొంగిప్రహించాయి. వాగులు వంతెనల మీది నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు

గూడూరు : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గూడూరు పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతమైన కొత్తగూడ, గంగారం, వరంగల్ జిల్లా ఖానాపురంలో కురిసిన వర్షాలకు పాకాల సరస్సుకు భారీస్థాయిలో నీరు చేరడంతో పాకాలవాగు నుంచి దిగువ ప్రాంతమైన పాకాలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పాకాలవాగు ఉధృతంగా ప్రవహిస్తోండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తగూడలో నీటమునిగిన పొలాలు

కొత్తగూడలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు



కోమట్లగూడెంలో ప్రవహిస్తున్న వాగు

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

డోర్నకల్, (మహబూబాబాద్ జిల్లా), జూలై 30 : గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్ అలియాస్ దేవా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బాదావత్ సూర్య అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా గంజాయి తరలిస్తున్నారు. డోర్నకల్‌లో 2021 జూలై 7న అప్పటి డోర్నకల్ ఎస్సై భద్రునాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండా అనుమానాస్పదంగా వస్తున్న ఆ ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ ట్రాలీకింద ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 150 గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉండగా 150 ప్యాకెట్లలో 3 క్వింటాళ్ల గంజాయి ఉంది. సుమారు దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులైన కిరణ్‌కుమార్, సూర్యను అదుపులోకి తీసుకుని అప్పటి డోర్నకల్ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ అధికారిగా ఉన్న అప్పటి సీఐ ఇస్లావత్ శ్రీనివాస్ సాక్ష్యాన్ని ఆధారంగా తీసుకున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నిందితులైన బానోత్ కిరణ్‌కుమార్, బాదావత్ సూర్యకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తరిగొప్పుల పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కేసు వివరాలను జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు ఎన్యానాయక్ తండా ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పందంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 1.565 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన భూక్య రమేష్ ఆలియాస్ రమ్మీ, జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌ను విచారించగా భూక్య రమేష్ కరీంనగర్ నుంచి గంజాయి తీసుకువచ్చి జలీల్‌కు విక్రయిస్తుండగా జలీల్ తరిగొప్పుల చుట్టుప్రక్కల గ్రామాల యువకులకు ప్యాకెట్ల రూపంలో రూ. 100 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నాడని తేలింది. ఈ విషయమై వరంగల్ సీపీ అంబర్ కిషోర్, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఎస్సై శ్వేతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, నర్మెట సీఐ సాయిరమణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




జనగామ జిల్లా తరిగొప్పుల పోలీసుస్టేషన్‌లో నిందితులను చూపుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్
























సీనియర్ వైద్యుడు కుమారస్వామి మృతి

సూపరింటెండెంట్ విధుల్లో చేరాల్సిన ముందు రోజే ఘటన



డాక్టర్ బి.కుమారస్వామి

వరంగల్ మెడికల్, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్, మంచిర్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన డాక్టర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన అయన గతంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సర్జికల్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. ఆ తరువాత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో మంచిర్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం మంచిర్యాలలో జాయిన్ కావాల్సి ఉండగా, సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో మంగళవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఇదిలా ఉంటే కొత్తగూడేనికి చెందిన కొందరి వేధింపుల వల్ల తన భర్త తీవ్ర ఆవేదనకు గురై మృతిచెందాడని ఆయన భార్య విలపించిన ఓ వీడియో వైరల్‌గా మారింది.

వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు



డాక్టర్ రమేశ్

వరంగల్ మెడికల్, జూలై 30: న్యూరో సైన్స్ అల్జీమర్స్ వ్యాధులపై పరిశోధనలు జరిపిన వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన నాసా సైంటిస్ట్ అవార్డు ప్రదానం చేసింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. డాక్టర్ రమేశ్ గతంలో కేఎంసీలో కూడా పనిచేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి పదేళ్ల అక్కడి మెమోరీ యూనివర్సిటీలో హెల్త్ సైన్సెస్ విభాగంలో అనేక పరిశోధనలు చేశారు. న్యూరో సైన్స్ విభాగంతోపాటు అల్జీమర్స్ వ్యాధిపై చేసిన పరిశోధనలకు గాను ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. ఈ వ్యాధులపై పరిశోధన చేసిన ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల్లో ఇద్దరు ఉండగా, భారతదేశం నుంచి డాక్టర్ రమేశ్ ఆస్థానాన్ని దక్కించుకున్నారు. రెండు రోజుల కిందట అమెరికా నాసా సైంటిస్ట్ అవార్డును రమేశ్‌కు ప్రకటించింది.

ఎలక్ట్రిక్ లోకో పీవోహెచ్‌పై ఆశలు

● ఎంపీలు చొరవ చూపి కాజీపేటలో నిర్మిస్తే 10 వేలమందికి ఉపాధి ● సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారుల పరిశీలన



కాజీపేట ఎలక్ట్రికల్ లోకోషెడ్

కాజీపేట, జూలై 30 : దక్షిణ భారత రైల్వేలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం కాజీపేటలోఉన్న ఎలక్ట్రికల్ లోకోషెడ్ దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో ఇంజన్‌ల నిర్వహణ, మరమ్మతులు చేసే ఒక మోటివ్ పవర్ డిపో.. దీనికి అనుసంధానంగా పీవోహెచ్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) కాజీపేటలోనే నిర్మాణం జరుగుతోంది. కాజీపేటలో నిర్మాణం జరిగితే ఇక్కడి రూపురేఖలు మారుతాయని రైల్వే ఉద్యోగాల సంఘాలు అంటున్నాయి.. ఈ పీవోహెచ్ కాజీపేటకు తీసుకు రాగలిగితే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించడానికి పెద్దగా ప్రయాసపడాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికే కాజీపేటలో వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ వ్యాగన్ ఓవరాలింగ్ పరిశ్రమ నిర్మాణపనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్‌లో నిర్మాణపనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రికల్ పీవోహెచ్ నిర్మిస్తే కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడుతూ పాత శోభను సంతరించుకుంటోంది. ఇక్కడ పీవోహెచ్ నిర్మిస్తే సుమారు 10 వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. కాజీపేటకు ప్రాధాన్యం పెరుగుతుంది. సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారులు ఇక్కడికి వచ్చి ఈ మధ్యనే పరిశీలించారు. స్థలం, రైల్వే స్టాఫ్ పొజిషన్, నీటి సౌకర్యం తదితర అంశాలపై ఒక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకూల అంశాలుగా ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటే..

ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ అంటే (పీవోహెచ్) ఎలక్ట్రిక్ లోకోలను ఒక్కొక్క భాగాలను విడదీసి ఓవరాలింగ్ చేసి కొత్త లోకో ఇంజన్ తయారు చేసే ప్రక్రియ. లోకోషెడ్‌లో మరమ్మతు చేసిన లోకో ఇంజన్‌లు ఇచ్చిన షెడ్యూల్ ట్రిప్పులు పూర్తయిన తర్వాత లోకోల మోడల్‌ను బట్టి 5,10,15 ఏళ్లకోసారి ఓవరాలింగ్ కోసం పీవోహెచ్ షెడ్‌కు రావల్సిందే. ఈ తతంగమంతా చేసే దానినే ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటారు. ఇలా పీవోహెచ్‌కు వచ్చిన లోకోల మెయింటనెన్స్, ఇన్‌స్పెక్షన్ చేయకముందే బయటకు పంపడం కుదరదు. ఒక విధంగా చెప్పాలంటే లోకోలను పరిశీలించి ఒక్కొక్కభాగాన్ని విడదీసి పనికొచ్చే భాగాలతో కొత్త లోకో తయారు చేయడమన్న మాట. అలాంటి ఎలక్ట్రికల్ పీవోహెచ్‌ను కాజీపేటలో నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాజీపేటలోనే నిర్మించడానికి అనుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ ప్రారంభమైంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఉండటం, ఇక్కడే ప్రస్తుతం దాదాపు 200 లోకోలకు మరమ్మతులు చేయడం, కావాల్సినంత స్థలం, నీరు, రవాణా అనుకూలంగా ఉండటమే ప్రధాన అంశం. పైగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌కు మంచి రైల్, రోడ్ కనెక్టివిటీ ఉండడమే కూడా ప్రధానం అంశంగా చెప్పొచ్చు. కాచిగూడ, కాజీపేట డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ షెడ్, గుత్తి, గుంతకల్ విజయవాడలో ఉన్న లోకోషెడ్‌లలో మొత్తంగా 1,195 లోకోలు ఉన్నాయి. ఇక్కడ మరమ్మతులు అయిన లోకోలను పీవోహెచ్‌కు తరలించడానికి పంజాబ్‌లోని కపుర్తాలకు, చెన్నైలోని పెరంబదూర్ తరలించి ఓవరాలింగ్ చేయాల్సి వస్తుంది. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం జోన్‌లో 800 లోకోలు ఉంటేనే పీవోహెచ్ నిర్మాంచాలని ఆదేశాలు ఉన్నాయి. మన జోన్‌లో 1,195 లోకోలు ఉన్నాయి. రైల్వే బోర్డు ఆదేశాలతో పీవోహెచ్ కాజీపేటలో కనుక నిర్మిస్తే లోకోలను తరలించే వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా రైల్వేకు మంచి లాభం. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమయంలో జిల్లా ఎంపీలు పట్టుపడితే కచ్చితంగా కాజీపేటకు వస్తుందని రైల్వేకార్మిక సంఘాలు, ఉద్యోగులు అంటున్నారు. ఎంపీలు చొరవచూపి ఇక్కడే నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే ఆఖరు

వరంగల్ చౌరస్తా, జూలై 30: ఆదాయ పన్ను రిటర్న్‌కు బుధవారం ఆఖరి గడువని అధికారులు పేర్కొంటున్నారు. గడువులోపు ఐటీ రిటర్న్ దాఖలు చేయని వారు పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రూ.5వేల పెనాల్టీతో డిసెంబరు 31 వరకు దాఖలు, రూ.వెయ్యి పెనాల్టీతో డిసెంబరు 31 వరకు చేసుకునే అవకాశాన్ని ఆదాయపు పన్ను శాఖ అవకాశమిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఏటా ఆదాయ పన్ను శాఖకు వ్యాపార, వాణిజ్య, ఉత్పత్తి సంస్థలకు చెందిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పన్ను చెల్లించే వారు 87వేల మంది ఉన్నారు. వీరు ప్రతీ ఏటా తమ ఆదాయాన్ని బట్టి తమ ఏడాది లాభ నష్టాలతో కూడిన వివరాల పత్రాలను ఆదాయపన్ను శాఖకు సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1,500 మంది డిఫాల్టర్లు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని సమాచారం. ఆదాయపన్ను శాఖ ప్రతీ ఏటా పన్ను చెల్లింపు ఐటీ రిటర్న్ దాఖలులో 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని గుర్తించినట్లు సమాచారం. వీరికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఆదాయపు పన్ను చెల్లింపు దారులకు ప్రభుత్వం ఉద్యోగులకు, చిన్న తరహా వ్యాపారులకు రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉన్న వారికి 5శాతం పన్ను, రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు 10శాతం, రూ.9లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షల ఆదాయం దాటిన ప్రతీ ఒక్కరు తమ ఆదాయంలో 30శాతాన్ని పన్నును ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు : మహేందర్‌బాబు, ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కొందరు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు దాఖలు పత్రాల్లో తప్పుడు సమాచారంతో మినహాయింపులు డిడెక్షన్లు చూపిస్తున్నారు. రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్‌ను పొందుతున్న విషయం ఆదాయపన్ను శాఖ విభాగం దర్యాప్తులో తేలింది. తప్పుడు రిటర్న్ దాఖలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

మడికొండ వద్ద ఘటన.. విద్యార్థులకు స్వల్పగాయాలు



లారీ ఢీకొని ధ్వంసమైన స్కూల్ బస్సు

మడికొండ, జూలై 30: స్కూల్ బస్సును లారీ ఢీకొనడంతో పలువురు విద్యార్థులకు గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సక్సెస్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళుతోంది. అదే సమయంలో మంచిర్యాలకు చెందిన లారీ వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో వాల్మీకినగర్ వద్దకు రాగానే స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొని, ఎదురుగావస్తున్న కారును సైతం ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం ధ్వంసమై అద్దం పగిలిపోయింది. దీంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి, ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. కొద్ది తేడాతో కారులోని వ్యక్తులు ప్రమాదం నుంచి తప్పించుకు న్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు.. లారీలు గ్రామంలోకి రావొద్దని ఎన్నిసా ర్లు ఆందోళన చేసినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. లారీల లారీలను గ్రామంలోకి రానివ్వద్దని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బురద మడిలో కుప్పకూలి రైతు మృతి

ఐనవోలు, జూలై 30: బురదమడిలో కుప్పకూలి రైతు మృతిచెందిన సంఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. డోబీల సంపత్(54) అనే రైతు మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. రెండు, మూడు రోజుల్లో పొలంలో నాటువేయాల్సి ఉండగా బురదమళ్లలో నీటిని పరిశీలిస్తూ గట్టుపై నుంచి నడుచుకుంటు వెళ్తూ బురదమడిలో బొర్లపడిపోయాడు. కొద్ది దూరంలో ఉన్న రైతులు అటుగా వచ్చి చూసేవరకు బురదమడిలో తల కూరుకుపోయి ఉన్నాడు. వారువచ్చి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కాగా, సంపత్ గుండెపోటుతోనే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల

వరంగల్ మెడికల్, జూలై 30: వైద్య, ఆరోగ్యశాఖ నాలుగో జోన్ పరిధిలోని నర్సింగ్ ఆఫీసర్స్ బదిలీ ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. సీనియారిటీ జాబితాలో తప్పుల తడకలు, యూనియన్ ఆఫీస్ బేరర్స్ లేఖలు, ధర్నాలు, రాస్తారోకోలు, కౌన్సెలింగ్ సమయంలో జరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు ఎంజీఎంకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అందరూ వెళ్లడంతో నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సేవలు అందించారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొనడంతో నాలుగో జోన్‌లోని నర్సింగ్ ఆఫీసర్లు అందరూ కొత్త పోస్టింగ్ బాట పట్టారు. కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోటు కాకుండా మరో చోటు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, 78మంది నర్సింగ్ ఆఫీసర్లను అధికారులు స్థానచలనం కల్పించారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు 23 మంది ఎంపిక

కేయూ క్యాంపస్, జూలై 30: కాకతీయ యూనివర్సిటీలో 23 మందిని నెల రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ సెంటర్ నేతృత్వంలో నాలుగు వారాల పాటు 23 మందికి బిల్డింగ్ కెపాసిటీ, ఇంగ్లీష్ గ్రామర్, కంప్యూటర్ స్కిల్స్, ఆఫీస్ ప్రొసీడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీరిలో క్లర్క్స్ కం టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, స్టోర్ కీపర్స్, ల్యాబ్ అసిస్టెంట్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు తరగతులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ప్రిన్సిపాల్ ఖాతా నుంచి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సెల్ఫ్ కార్యాలయానికి చెల్లించాలని వివరించారు. కేయూ పీఆర్వో, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌ను సమన్వయకుడిగా నియమించారు.

బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధం

ఆర్జేడీకి ఫిర్యాదు చేసిన సీనియర్ అసిస్టెంట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధంగా ఉన్నాయని ఖమ్మం డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.గాయత్రిదేవి ఆరోపించారు. ఆఫీస్ బేరర్ల అసంబద్ధ లేఖలతో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె మంగళవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు వెలువరిచిన తర్వాత యూనియన్ ఆఫీస్ బేరర్‌గా జారీ చేసిన లేఖలు లెక్కా పత్రం లేకుండా ఉన్నాయని విమర్శించారు. లేఖలను అభ్యర్థుల పేరున వ్యక్తిగతంగా ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. బదిలీల నిబంధనల మేరకు 40 శాతంలో తాను రానప్పటికీ అక్రమ మార్గంలో నలుగురు సహోద్యోగులు టీఎన్‌జీవోస్ ఆఫీస్ బేరర్లుగా లేఖలు సమర్పించడంతో తాను హనుమకొండ నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు యూనియన్ ఆఫీస్ బేరర్లు అయినప్పటికీ స్టేషన్ సీనియారిటీలో ఆరేళ్లంటే వారిని తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని ఉన్నప్పటికీ అధికారులు ఆ నిబంధనను విస్మరించారని ఆరోపించారు. ఇలాంటి పొరపాట్లే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో జరిగితే ఆఫీస్ బేరర్ల లేఖలు సమర్పించిన వారిని నిబంధనల మేరకు బదిలీలు చేశారన్నారు. ఉద్యోగుల బదిలీల నిబంధనలు డిపార్ట్‌మెంట్‌కు ఒక విధంగా ఉంటాయా? అని ఆమె ప్రశ్నించారు. అసంబద్ధంగా, అక్రమ మార్గంలో ఆఫీస్ బేరర్ల లేఖలను తీసుకురావడంతోనే బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె ఆరోపించారు. వైద్యశాఖలో అధికారులు చేపట్టిన చర్యల్లాగా విద్యాశాఖలోనే అలాంటి చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని ఆమె అధికారులను వేడుకుంది. తాను ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో పాటు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానన్నారు.

అయ్యో.. రామా!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నదీస్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఐదుగురు
- నలుగురిని కాపాడిన రెస్క్యూ టీమ్



అయోధ్యకు వెళ్లే ముందు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఫొటో దిగిన నాగరాజు కుటుంబసభ్యులు, గల్లంతైన తేజశ్రీ (ఇన్‌సెట్లో)

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముడి దర్శనానికని సంతోషంగా వెళ్లిన ఆ కుటుంబానికి దేవుడు తీరని శోకాన్ని మిగిల్చాడు. నీటి ప్రవాహం రూపంలో వచ్చిన మృత్యువు కళ్ల ముందే కూతురును బలితీసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నదీస్నానం చేస్తున్న యువతిని సరయూ నది మింగేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య లక్ష్మణ కిలా ఘాట్ వద్ద జరిగింది. లక్ష్మణ ఘాట్‌లో స్నానం చేస్తున్న జనగామకు చెందిన యువతి సరయూ నదిలో గల్లంతైంది. జనగామకు చెందిన తాళ్లపల్లి నాగరాజు ఉపాధి కోసం జనగామలోని సిద్దిపేట రోడ్డులో వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులందరితో అయోధ్య, కాశీ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. తన భార్య జయసుధ, కూతుళ్లు తేజశ్రీ, తరుణితో పాటు సోదరులు చంద్రశేఖర్, చందు కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లారు. ఆదివారం రాత్రి విమానంలో హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరుకున్నారు. సోమవారం ఉదయం అయోధ్య బాలరాముడి దివ్య దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత కాశీకి వెళ్లేముందు అయోధ్యలోని సరయూ నది ఒడ్డున ఉన్న లక్ష్మణ ఘాట్‌లో నదీస్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఘాట్‌లో స్నానం చేస్తున్న ఐదుగురు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్ స్పందించి నలుగురిని కాపాడింది. నీటిప్రవాహం మరింతగా పెరగడంతో నాగరాజు పెద్దకూతురు తేజశ్రీ(17) నీటిలో కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ఈ ఘటన జరగగా మంగళవారం రాత్రి వరకు యువతి ఆచూకీ లభ్యం కాలేదు. సరయూ నదిపై ఉన్న డ్యామ్ గేట్లు ఎత్తడం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కాగా.. తేజశ్రీ జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.

కన్నీరుమున్నీరుగా..

కళ్లముందే కూతురు గల్లంతు కావడంతో ఆ తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఊరు కాని ఊరులో తమ బిడ్డ ఆచూకీ లభ్యం కావాలని, ప్రాణాలతో బయట పడాలని ఆ అయోధ్య రాముడిని తలచుకుంటూ ఆ కుటుంబ సభ్యులు సరయూ నది ఒడ్డునే బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. అప్పటిదాకా అందరితో సంతోషంగా, నవ్వుతూ గడిపిన కూతురు గల్లంతు కావడం ఆ తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

యూపీ అధికారులకు బండి సంజయ్ లేఖ

యువతి గల్లంతు విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. యూపీ అధికారులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. యువతి ఆచూకీని త్వరగా కనుక్కోవాలంటూ అయోధ్య కలెక్టర్ చంద్ర విజయ్‌సింగ్, అయోధ్య ఎస్పీ రాజ్ కరణ్ నాయర్, యూపీ ముఖ్యమంత్రి ఓఎస్డీకి సూచించారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రావుల వెంకట్‌రెడ్డి

వికలాంగులకు ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలి

వడ్డెపల్లి, జూలై 30: వికలాంగులందరికీ జీవోనంబర్ 56 ప్రకారం ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలని దివ్యాంగుల సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండిస్వరూప, రాష్ట్ర సలహాదారుడు సమ్మెట వేణుగోపాల్ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన విధంగానే దివ్యాంగులకు సైతం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. బ్యాంకులతో నిమిత్తం లేకుండా రూ.10లక్షల రుణాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సేవా సంఘం జిల్లా నాయకులు రాజ య్య, మహాలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా

బాలసముద్రం, జూలై 30: బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాలను వరంగల్ 1డిపోలో ముగింపు వేడుకలను వరంగల్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ డి.విజయభాను ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పాల్గొని ఆర్టీసీ రీజినల్ పరిధిలో 9 డిపోల నుండి ఆర్టీసీ విధులలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఇతర సిబ్బందిని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బస్సు నడుపుతున్నప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఆర్ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. అత్యధిక సర్వీస్ కలిగి ప్రమాదరహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకున్న డ్రైవర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, మాధవరావు, రీజియన్‌లోని 9 డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

● బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 30 : తాము అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని మాయమాటలు చెప్పి, రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా బీసీలకు అన్యాయం చేస్తోందని బీజేపీ అనుబంధ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫైండ్ల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ...బీసీలకు తక్షణమే 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేయాలన్నారు. గొల్లకురుమలకు రెండో దశ గొర్రెలను పంపిణీ చేయాలని, మత్స్యకార్మికులకు సబ్సీడీతో కూడిన చేపపిల్లలను పంపిణీ చేయాలన్నారు. మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు అశోక్, చింతల శివకృష్ణ, గంధసిరి మధు, చుక్కల నరేష్, జంపయ్య, బ్రహ్మాచారి, రజినీకాంత్ పాల్గొన్నారు.

జిల్లాలో 462.2 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 30 : జిల్లాలోని కొత్తగూడ, గంగారం మండలాల్లో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. కొత్తగూడలో 102.4, గంగారంలో 120.6, బయ్యారంలో 16.4, గార్లలో 19.6, డోర్నకల్‌లో 16.0, కురవిలో 3.2, మహబూబాబాద్‌లో 19.2, గూడూరులో 20.2, కేసముద్రంలో 57.2, నెల్లికుదురులో 28.8, నర్సింహులపేటలో 2.0, మరిపెడలో 6.4, తొర్రూరులో 42.4, పెద్దవంగరలో 7.8, వెరసి 462.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జిల్లాలో సగటున 28.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

తెరుచుకోని ఎమ్మార్సీ కార్యాలయాలు

● క్రమబద్ధీకరించాలని చలో అసెంబ్లీకి వెళ్లిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 30 : జిల్లా వ్యాప్తంగా మండల విద్యాశాఖ కార్యాలయాలు మంగళవారం తెరుచుకోలేదు. విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో గత 15 ఏళ్లగా సీఆర్పీలు, ఎంఐఎస్-కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో ఛలో అసెంబ్లీకి తరలివెళ్లారు. దీంతో మండల కేంద్రాల్లో ఉన్న ఎమ్మార్సీ కార్యాలయాలు మూతపడ్డాయి. గత ఏడాది సెప్టెంబరులో తమను ప్రభుత్వం ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని జిల్లా కేంద్రాల్లో 22 రోజుల పాటు నిరసన దీక్షలు చేపట్టారు. ఆ సమయంలో హన్మకొండ ఏకశిలా పార్కు వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న ధర్నా శిబిరాన్ని ఆనాటి ప్రతిపక్షనాయకుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం అని ప్రభుత్వం ఏర్పాటు చేయగానే



కేసముద్రం ఎంఆర్సీకి తాళం వేసి అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లిన కాంట్రాక్టు ఉద్యోగులు

పిలిపించుకొని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అయినప్పటికీ మా సమస్యను సరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించలేక పోవడంతో చలోఅసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో విధులకు హాజరుకాలేదు.

● కేసముద్రం : కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేసముద్రం మండల విద్యావనరుల కేంద్రానికి తాళం వేసి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లినట్లు ఎంఆర్సీ కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపారు. ఈ ఆందోళనలో షేక్ ఖాదర్, బానోత్ భిక్షపతి, వెన్ను భిక్షపతి, సీఆర్పీలు మురళి, స్వాతి, సరిత, సుల్తానా, పద్మ, నాగమణి, ఉపెందర్, వెంకటరమణ పీఈటీలు పాల్గొన్నారు.

● గూడూరు : విద్యాశాఖలో భాగమైన సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు చలో అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లారు. దీంతో గూడూరు ఎమ్మార్సీ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు. కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలు, ఐఆర్‌పీలు, మెసెంజర్లు అందరు సంయుక్తంగా హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్లడంతో విధులకు ఎవరూ హాజరుకాలేదు. దీంతో ఎమ్మార్సీ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు.

రోడ్డుపై నాటు వేసి నిరసన

నెల్లికుదురు, జూలై 30 : రోడ్డు పనులు చేపట్టడంలేదని రత్తిరాంతండా శివారు కునాయికుంట తండావాలసులు మంగళవారం రోడ్డుపై నాటు వేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గుగులోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ నెల్లికుదురు ప్రధాన రాహదారి నుంచి కునాయికుంట రోడ్డుకు బీటీ రోడ్డు వేయకపోవడంతో గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. వర్షాకాలంలో నెల్లికుదురుకు విద్యార్థులు చదువుకోవడానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులకు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నప్పటికి రోడ్డు పనులుకు నిధులు మంజూరు చేయడంలేదన్నారు. ఓట్లకోసమే తండాకు వస్తున్నారని తండాను అభివృద్ధిచేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఎంపీలుస్పందించి రోడ్డు పనులు చేపట్టడానికి కృషి చేయాలన్నారు. తండావాసలు పాల్గొన్నారు.

మొరాయించిన అంబులెన్స్

గూడూరు, జూలై 30 : ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన సంజీవని 108కు స్టాటింగ్ ట్రబుల్ ఏర్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా నేతాజీ మార్కెట్ సమీపంలో ఉంటున్న పెరమాళ్ల సురేష్ ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం నర్సంపేట నుంచి భద్రాద్రి కొత్త గూడెంకు వెళ్తుండగా గూడూరు మండలం భూపతిపేట సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఆటో నడుపుతున్న సురేష్‌కు ఫిట్స్ వచ్చింది. దీంతో వాహనం సబ్‌స్టేషన్ ఆవరణలోకి దూసుకెళ్లింది. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను చూసి రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు 100కు డయల్ చేశారు. దీంతో బ్లూకోర్ట్ కానిస్టేబుల్ సుధాకర్‌తో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్ల అక్కడికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోలీసు వాహనంలో



చికిత్స పొందుతున్న సురేష్

తీసుకువచ్చారు. సురేష్‌ను పరిశీలించిన వైద్యుడు శ్రీనివాస్ పరిస్థితి సీరి యస్‌గా ఉందని నర్సంపేటగాని, మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికిగాని, లేక ఎంజీఎంకు తరలించాలని సూచిం చారు. దీంతో సదరు పోలీసులు స్థానిక యువకులు అంబులెన్స్ స్టాటింగ్ ట్రబుల్‌తో ఇబ్బందులు పడుతుండగా గమనించిన వారు నెట్టే



గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్‌ను నెట్టుతున్న పోలీసులు, స్థానికులు

ప్రయత్నం చేశారు. అయినా అంబులెన్స్ మొరాయించింది. చివరకు అతికష్టం మీద అంబులెన్స్ స్టార్ట్ కావడంతో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

'సామాజిక సేవలో మహిళలు ముందుండాలి'

గూడూరు, జూలై 30 : మండల సమైక్య మహిళలు ఆర్థిక లావాదేవీలే కాకుండ సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండాలని గూడూరు ఎంపీడీవో వీరస్వామి అన్నారు. గూడూరు ఐకేపీ కార్యాలయంలో ఉదయశ్రీ మండల సమైక్య 11వ వార్షిక మహాసభను అధ్యక్షురాలు జోగ కౌసల్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతీ ఒక్క మహిళ తమతమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్లఅప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ గ్రామంలో బ్యాంకుఏర్పాటు కోసం ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. మహిళ సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు మేనేజర్ చైతన్య, ఏపీఎం రవీందర్, సమైక్య పాలకవర్గం సౌజన్య, సుగుణమ్మ, రేణుక, మమత, మాజీ ప్రజాప్రతినిదులు నూనావత్ రమేష్‌నాయక్, కత్తి స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొరవారి తిమ్మాపురంలో కూలిన ఇల్లు



దొరవారితిమ్మాపురంలో కూలిన పెనక నారాయణకు చెందిన ఇల్లు

గూడూరు, జూలై 30 : మండలంలోని మట్టేవాడ శివారు దొరవారితిమ్మాపురంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెనక నారాయణకు చెందిన ఇళ్లు కూలిపోయింది. ఏజెన్సీప్రాంతంలో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా తమ ఇళ్లు కూలిపోయిందని నారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తనకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని వేడుకున్నాడు.

'బీసీ రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలి'

కేసముద్రం, జూలై 30 : రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు చొప్పరి శేఖర్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల నిర్వహిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. బీసీల సంక్షేమానికి రూ.25 వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

అంతర్యామి ఆధ్వర్యంలో సాయం

కేసముద్రం, జూలై 30 : కేసముద్రం విలేజిలో ఇటీవలె వేర్వేరు కుటుంబాలకు చెందిన దేశబోయిన నర్సయ్య, గంగాపురం సోమక్క మృతి చెందగా అంతర్యామి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల చొప్పున సహాయాన్ని మంగళవారం అందజేశారు. గ్రామంలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఎవరైనా మరణిస్తే వారికి అంత్యక్రియల నిమిత్తం సభ్యులంతా చందాలు రూ.5వేల చొప్పున అందజేస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

పోలీసుల అదుపులో జీపీ కార్మికులు

కేసముద్రం, జూలై 30 : హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నాకు తరలివెళ్లేందుకు సిద్ధమైన కేసముద్రం విలేజి గ్రామపంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. జీపీ కార్మికులు వల్లందాసు అనీల్, కొమ్ము సంజీవ, వల్లందాసు అశోక్, బిర్రు శివ, కొమ్ము లింగమ్మ, దుర్గం మరియమ్మ, పందుల యాకమ్మ మరికొంత మందిని అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై మధ్యాహ్నం వరకు వదిలిపెట్టారు.

డీసీఈబీ కమిటీని రద్దు చేయాలి

● జిల్లా కలెక్టర్‌కు పీఆర్టీయూ-టీఎస్ విజ్ఞప్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 30 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన డీసీఈబీ కమిటీని రద్దు చేయాలని పీఆర్టీ యూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి అసంబద్ధ నిర్ణయాలతో విద్యాశాఖ అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందన్నారు. బదిలీలు, పదోన్నతుల్లో అనేక అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ చేపట్టాలని కోరారు. డీసీఈబీ పరీక్షల బోర్డునందు అసిస్టెంట్ సెక్రటరీ, సబ్జెక్టుల పట్ల అవగాహన, పరీక్ష నిర్వహణ తెలియకుండా, పాఠశాలకు వెళ్లకుండా డీఈవో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కమిటీని రద్దు చేయాలని కోరారు. కళ్లెం వెంకట్‌రెడ్డి, రాంమూర్తి, రాంజీ, పాల్గొన్నారు.

మానుకోట ఆర్టీసీ డ్రైవర్లకు ఘనసన్మానం



వరంగల్‌లో సీపీ అంబర్‌కిషోర్ ఝూ చేతుల మీదుగా సన్మానం పొందిన మానుకోట ఆర్టీసీ డిపో డ్రైవర్లతో డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్/తొర్రూరు, జూలై 30 : టీజీ-ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సందర్భంగా వరంగల్-1 డిపోలో వరంగల్ రీజియన్ పరిధిలోని ఉత్తమ డ్రైవర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎటువంటి రోడ్డు ప్రమాదాలు చేయని డ్రైవర్లను ఎంపిక చేసి ప్రశాంసాపత్రాలను అందించి అభినందించారు. వరంగల్‌లో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయబాను ఆధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) అంబర్ కిషోర్ ఝూ చేతుల మీదుగా డ్రైవర్లను సన్మానించారు. అందులో బాగంగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన ముగ్గురు డ్రైవర్లు ఎస్డీ.సత్తార్, కె.హరికుమార్, బి.సోమయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానుకోట ఆర్టీసీడిపో మేనేజర్ ఎం. శివప్రసాద్, ఈఎస్ చారి, వెంకన్న పాల్గొన్నారు. అలాగే తొర్రూరు ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఎండీ. రఫీ, వి.జంగయ్య, వి.స్వామి విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తూ ప్రతిభ కనబర్చడంతో ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా, రీజినల్ మేనేజర్ ఉదయభాను చేతుల మీదుగా అవార్డులు అందించడం జరిగిందన్నారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్, ఎస్టీఐలు, ఎంఎఫ్ ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు న్యూట్రిషన్ కిట్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ జగదీశ్వర్

మహబూబాబాద్ టౌన్, జూలై 30 : లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినీలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ బి.జగదీశ్వర్ మాట్లాడుతూ..విద్యార్థినీలు ఫోలిక్ యాసిడ్ లేమి సమస్యతో రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. నిత్యంపాలు, సీజనల్ వారీగా లభించే పండ్లు, కూరగాయలు తినడం వల్ల సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం 400 మంది విద్యార్థినీలకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. లయన్స్‌క్లబ్ అదనపు డిస్ట్రిక్ట్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, డాక్టర్ సురేష్, రెడ్యానాయక్, పర్కాల రవీందర్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు కె.గిరిజ, శ్రీవాణి, కె.వసంత, జి.సునిత, పద్మావతి, ఎం.వీణ, స్వాతి, రంజాన్, అలీ,సంజీవ,విజయ్‌కుమార్, మమత, విజయలక్ష్మి, సుచిత్ర, సంధ్యారాణి పాల్గొన్నారు.

'సమాజానికి సేవ చేయడం అభినందనీయం'

తొర్రూరు, జూలై30 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు సమాజ సేవచేయడం ఎంతో అభినందనీయమని లయన్స్‌క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ కె.రాజేందర్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు జన్మదిన సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. డయాబెటిస్ క్యాంప్, ఉచితవైద్య పరీక్షలు, మొక్కలు నాటడం, పేదరికంలో ఉండి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ అందజేత, మరో విద్యార్థికి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.20వేల నగదు సహాయం, 50 మంది మునిసిపాలిటీ సిబ్బందికి చీరల పంపిణీ, వంద గొడుగుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎంతో కష్టపడి అంతర్జాతీయ స్థాయిలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ కావడం, పేద ప్రజలకు సేవలు అందించడం ద్వారానే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ప్రతి ఒక్కరు సమాజానికి తోటి వారికిసేవ చేయాలని, మాతృభూమి రుణం తీర్చుకోవాలన్నారు. అనంతరం మార్కెట్ ఆవరణలో 500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్, తమ్మి రమేష్, లక్ష్మీనర్సింహరావు, రేగూరి వెంకన్న, కిరణ్‌కుమార్, సరేష్, శారద, విశ్వేశ్వరరావు, శ్రీదేవి, ప్రభాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మహబూబాబాద్ టౌన్, జూలై 30 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, డాక్టర్ రమ్య అన్నారు. మానుకోటలోని జగ్జీవన్‌రామ్ కాలనీ, బెస్తబజారుల్లో మంగళవారం వైద్యశిబిరాలను నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురికినీరు నిలిస్తే దోమలు వ్యాప్తిచెందే అవవకాశం ఉందని అందుకోసం నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆయా వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఏఎన్ఎంలు పద్మావతి, మమత, ఆశావర్కర్ జనని పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, జూలై 30 : అందనాలపాడు గ్రామశివారులో ఓచెరువు కట్టపై నిల్వ చేసిన 25 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోదుగు గడ్డతండాకు చెందిన సీరోలు మండలంకు చెందిన కాంపెల్లి సాయి, కొత్తతండాకు చెందిన ఆటో డ్రైవర్ నూనావత్ బిక్కు నిషేధిత నల్లబెల్లాన్ని ఓ ఆటోలో తీసుకువచ్చి సీరోలు శివారు కొత్తతండ వద్ద ఉన్న చెరువు కట్ట వద్ద నిల్వ చేస్తుండగా డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 50 బస్తాల్లోని 25 క్వింటాళ్ల బెల్లంతో పాటు రెండు బస్తాల పటికను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు కారకులైన గుగులోతు నరేష్, కాంపెల్లి సాయి, నూనావత్ బిక్కులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిలో బిక్కును అదుపులోకి తీసుకోగా కాంపెల్లి సాయి, గుగులోతు నరేష్‌లు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్ల ఆర్.సైదులు, శివ ఉన్నారు.

కార్మికులకు రెయిన్‌కోట్‌ల పంపిణీ

డోర్నకల్, జూలై30 : గొల్లచర్ల గ్రామపంచాయతీ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం అఖిలభారత గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లెపు సతీష్ సమకూర్చిన రెయిన్‌కోట్‌లను కల్లెపు నారాయణరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు వర్షం పడే సమయంలో తడవకుండా విధులు నిర్వహించేందుకు రెయిన్‌కోట్‌లను అందించినట్లు పేర్కొన్నారు. కల్లెపు సతీష్, కోయల శ్రీను, చెట్టిపల్లి రమేష్, నాగయ్య, వీరన్న, రామస్వామి, లింగయ్య వెంకన్న, రఘు, సైదులు, రామాచారి, అప్పయ్య యాదగిరి, వెంకటప్పయ్య, లలిత పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 30 : మునిసిపల్ పరిధిలోని 36 వార్డుల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలువార్డుల్లోని రోడ్లు దెబ్బతిన్నాయని వాటి మరమ్మత్తుల కోసం వార్డుకు రూ.లక్ష నిధులు కేటాయించాలని కోరారు. రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని బాగుచేయాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, వెలుగు శ్రావణ్, మాలోతు రవీందర్, నక్క నాగార్జున పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 30 : జిల్లాలో నిబంధనలు పాటించని ప్రవేటు ఐటీఐ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మానుకోటలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో సరైన వసతులు కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మాదారపు నాగరాజు, మహేష్, విజయ్, బాలకృష్ణ, దిలీప్ పాల్గొన్నారు.

టీపీవోగా సాయిరాం బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ టౌన్, జూలై 30: మహబూబాబాద్ మునిసిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా మంగళవారం ఏ.సాయిరాం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ టీపీవోగా పని చేసిన నవీన్‌కుమార్ భద్రాద్రి కొత్తగూడెంకు వెళ్లగా అక్కడ పని చేస్తున్న సాయిరాం మానుకోటకు బదిలీపై వచ్చారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సాయిరాం టీపీవోగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఫొటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

మరిపెడ, జూలై 30 : ఫొటోగ్రాఫర్లకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు ఇప్పించాలని మరిపెడ మండల ఫొటోగ్రాఫర్, వీడియోగ్రఫీ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే.ఫక్రుద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయూనియన్ సమావేశం జరుగగా ఫక్రుద్దీన్ పాల్గొని మాట్లాడారు. ఫొటోగ్రాఫర్లు ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల రాకతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భద్రు, నరేశ్, లింగన్న, శ్రీకాంత్, రమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం !?

తొర్రూరు రూరల్, జూలై 30 : మండలంలోని ఫత్తేపురం గ్రామశివారులోని జామాయిల్ తోటలో క్షుద్రపూజలు జరిగిన ఆనవాళ్లు ఉన్నాయి. మంగళవారం సాయంత్రం తోటలోకి వెళ్లిన పలువురు యువకులు అక్కడి దృశ్యాలను చిత్రీకరించి గ్రూపుల్లో వైరల్ చేశారు. అసలు ఆ తోటలో ఎందుకోసం పూజలు జరిగాయి, ఏం జరిగిందో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆ పూజలో ఓ మహిళ లో దుస్తువులు, మట్టెలు, కమ్మలు, పుసైలు, నిమ్మకాయలు, రెండుచాక్‌లు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా అక్కడే ఓ జంతువును బలి ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై తొర్రూరు ఎస్సై జగదీష్‌ను వివరణ కోరగా ప్రజలను భయాందోళనకు గురి చేసేవిధంగా ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాయకులపై చర్యలు తీసుకోవాలి

గార్ల జూలై 30 : అధికార పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ నష్టం కలిగించే నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దనియాకుల రామారావు కోరారు. సోమవారం పల్లురు గ్రామంలో ఎమ్మెల్యే పనితీరుకు వ్యతిరేకంగా గ్రూపులు కట్టి సమావేశం ఏర్పాటు చేసిన నాయకులపై జిల్లా కమిటీ విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చం దర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సీరోలు, జూలై 30 : మండల నూతన ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీరోలులో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో మండల అధ్యక్షుడిగా మక్కల వీరన్న, ఉపాధ్యక్షుడిగా పెరుగు రాజుయాదవ్, ప్రధానకార్యదర్శిగా ఆకోజు శ్రీనివాస్, కోశాధికారిగా గుగులోతు భాస్కర్, సహాయకార్యదర్శిగా బాణాల సతీష్, కార్యవర్గ సభ్యులుగా మణికంటి అశోక్, రేపాల వెంకటనారాయణ, హనుమంతుల రాజు, భూక్య అనిల్, యాకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మహబూబాబాద్ జిల్లా కార్యవర్గసభ్యులుగాగంగారపు సుధాకర్, ఒరయోగుల గిరిధర్‌ను ఎన్నుకున్నారు. మండలంలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

కూలీల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందిస్తున్న వ్యకా.సం నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 30 : వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంతో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగావెంకన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు సంవత్సరంలో 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.700 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంగరబోయిన రాజు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి పాల్గొన్నారు.

శ్రీరామగిరి డప్పు కళాకారుడికి గౌతమినంది మయూర పురస్కారం

నెల్లికుదురు, జులై 30 : మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు పెరమాండ్ల బాబు హైదరాబాద్‌లోని త్యాగరాజ గాణసభలో మంగళవారం జాతీయ స్థాయిగౌతమి నంది మయూర పురస్కారం అందుకున్నాడు. గౌతమేశ్వర గోరక్షణ ఆధ్వర్యంలో జరిగిన బంగారు నంది పురస్కార సభలోవిశ్వవిఖ్యాత ఎస్వీఆర్ వెంకటేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఈసందర్భంగా పెరమాండ్ల బాబు మాట్లాడుతూ స్వర్గీయ తెలంగాణ కళాకారుడు సాయిచంద్ టీంలో డప్పు కొడుతూ వందలాది సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపాడు.పెరమాండ్ల బాబుకు అవార్డు రావడం పట్ల శ్రీరామగిరి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలు కోసం ఉద్యమాలు

మహబూబాబాద్ రూరల్, జూలై 30 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం దశలవారీగా ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసినసమావేశంలో ఆయనమాట్లాడుతూ... కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీలో అనేక లోపాలు జరిగాయని, అర్హులైన రైతులకు రుణమాఫీ జరుగలేదని పేర్కొన్నారు. తెల్లరేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇండ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు సాయం ఇస్తామని చెప్పి నేటికి ఆ హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. ఆగస్టు 1న మండల కేంద్రాల్లో 8న జిల్లా కలెక్టరేట్ ముట్టడి, 21న చలో హైదరాబాద్ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బిల్లకంటి సూర్యం, రంగయ్య, యాదయ్య, భాస్కర్, యాకయ్య పాల్గొన్నారు.